# ముఖ్యమంత్రి కార్యాలయం

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికాప్రకటన-1 తేది:13.04.2015

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల జరిగిన నష్టం పై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల వల్ల మరణించిన వారి కుటుంబాలను, పంట నష్టం జరిగిన రైతులను, పశువులు కోల్పోయిన యజమానులను,ఇండ్లు కోల్పోయిన నిరాశ్రయులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, నీటి పారుదల శాఖ మంత్రి టి. హరీష్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, రెవెన్యూ కార్యదర్శి మీనా తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పిడుగు పాటు, వడగండ్లు, భారీ వర్షాల కారణంగా జరిగిన ప్రమాదం వల్ల చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. వెంటనే జిల్లాల వారీగా మృతుల వివరాలను పంపాల్సిందిగా అధికారులను కోరారు. అకాల వర్షాల వల్ల ఎంత పంట నష్టం జరిగింది? ఎన్ని ఇండ్లు పూర్తిగా కూలిపోయాయి? ఎన్ని ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి? ఎన్ని పశువులు మరణించాయి? లాంటి అంశాలపై పూర్తి స్థాయి నివేదికలను కలెక్టర్ల నుండి తెప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. నివేదిక వచ్చిన వెంటనే తగిన ఆర్థిక సహాయం అందించాలని సిఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు వెంటనే ఆర్థిక సహాయం అందించాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు, వడగండ్ల వాన తదితర ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం తరుపున వెంటనే స్పందించాలని, నష్ట నివారణ చర్యలు చేపట్టడంతో పాటు బాదితులకు సకాలంలో సాయం అందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. బాధితులను ఆదుకునే విషయంలో మానవత్వంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

**(సిపిఆర్ఓ టు సియం)**